రైతుకు భరోసా అందేనా?

- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు



గార్లదిన్నె: జిల్లా వ్యాప్తంగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. మరికొంత మంది ఇప్పటికే వేరుశనగ సాగు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయంగా ఇస్తామని ప్రకటించింది. ఖరీఫ్ పంటసాగు ముగుస్తున్నా ఇంకా ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయలేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబంధించి తొలి విడత సాయంగా రూ.2 వేలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయంపై ఊసేలేదు. మే నెల లోనే రైతు భరోసా నగదు రూ.5500 ఇవ్వాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమలుతో అది కాస్త ఆగిపోయింది. పీఎం కిసాన్ నగదు దుక్కులు, విత్తనాలు కూలీల ఖర్చుల అవసరాలకు ఉపయోగపడింది. ఎరువులు, పురుగు మందులు కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

సాగు ఆరంభంలోనే ...

గతంలో పంటల సాగు పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత ప్రభుత్వం సాగు ఆరంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందించేది. పీఎం కిసాన్ సాయం రూ.6వేలు, రైతు భరోసా రూ.7,500 కలిపి ఏటా రూ.13,500, మూడు విడతలుగా రైతులకు అందేది. శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాలు ఉన్నాయి.ఆయా మండలాల్లో వేల మంది రైతులకు కోట్లు రూపాయలు అందేవి. అలాగే భూ యజమానులతో పాటు ఎలాంటి భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ్ బోర్డు భూములు సాగు చేసే రైతులకు రైతు భరోసా సాయం కింద పెట్టుబడి సాయం అందేది.

రైతుల ఎదురు చూపు..

ప్రస్తుతం శింగనమల నియోజకవర్గంలో కొందరు రైతులు వేరుశనగ, కంది తదితర పంటల సాగు పనులు ప్రారంభించారు. మరి కొంత మంది రైతులు వర్షం వస్తే పంటలు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. పంటలు సాగుకు ఎకరాకు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకూ పెట్టుబడి అవసరం. గతంలో పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా నగదు ఒకేసారి అందుతుండడంతో పెట్టుబడికి ఉప యోగపడేది. ఇప్పుడు పీఎం కిసాన్ రూ.2వేలు మాత్రమే అందడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందజేస్తామని కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా రైతు పెట్టుబడి సాయంపై ఇంత వరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో సాగు ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

నియోజకవర్గంలో వివరాలు ఇలా

మండలం	రైతుల సంఖ్య
శింగనమల	1296
గార్లదిన్నె	8996
పుట్లూరు	8120
యల్లనూరు	6200
నార్పల	8900
బీకేఎస్	8750

సాయం అందజేయాలి



ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం అందకపోవడంతో పంటలు సాగు చేసేందుకు రైతులు ఇతరుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమచేయాలి. పెట్టుబడి సాయం అందిస్తే రైతులకు కొంత మేరకు వెసులుబాటు కలుగుతుంది.

– అక్కుర్, రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

గతంలో పీఎం కిసాన్, రైతు భరోసా అందేవి



గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం మే నెలలోనే పీఎం కిసాన్, రైతుభరోసా నగదు ఒకే సారి అందేవి. దీంతో పంట పెట్టుబడి కోసం ఎంతో ఉపయోగపడేది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు సీజన్ ముగుస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం పెట్టుబడి సాయం ప్రకటించలేదు ప్రభుత్వం వెంటనే రైతులకు పెట్టు బడి సాయం అందించాలి.

– వెంకటశివారెడ్డి, రైతు, తిమ్మంపేట

క్లుప్తంగా

ఘనంగా పూర్వాభాద్ర హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం స్వామి జన్మ నక్షత్రమైన పూర్వాభాద్రను పురస్కరించుకుని హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ యాగశాలలో స్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూర్వాభాద్రహోమాన్ని నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ప్లాస్టిక్ విక్రయించినా, వాడినా చర్యలు



మాట్లాడుతున్న ఈఓఆర్‌డీ వెంకటేశ్వర్లు

యాడికి: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ప్లాస్టిక్ నిషేధం, మరుగుదొడ్ల వినియోగంపై గ్రామ సభ నిర్వహించారు. సర్పంచు అనూరాధ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్లాస్టిక్‌ను విక్రయించినా, వినియోగించినా చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ శిక్షణ కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి

గుత్తి: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం బ్యూటీషియన్ శిక్షణ కేంద్రాన్ని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ బాలికలు, యువతులు, మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం జన శిక్షణ సంస్థాన్ బ్యూటీషియన్ శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ డిల్లీశ్వరి, ఏసీడీపీఓ నాగమణి, జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ సుధాకర్, పీఓ అబ్దుల్ రషీద్, బ్యూటీషియన్ ట్రెయినర్ రజిని, సూపర్ వైజర్లు నాగేశ్వరి, బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీయడమే ఆర్డీటీ లక్ష్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్ఎం

గుంతకల్లు: గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయడమే ఆర్డీటీ లక్ష్యమని వక్తలు అన్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో మండల హైస్కూల్ స్థాయి బాలబాలికల క్రికెట్ పోటీలను స్థానిక ఎస్‌జేపీ హైస్కూల్‌లో ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా గుంతకల్లు మండల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.హరినాథ్‌గౌడ్, ఎస్‌జేపీ హైస్కూల్ హెచ్ఎం భూపాల్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఆర్డీటీ కోచ్ ఇనయతుల్లా మాట్లాడుతూ ఆగస్టు 2 వరకూ నిర్వహించే క్రికెట్ పోటీల్లో 18 బాలుర జట్లు, 10 బాలికల జట్లు పాల్గొంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ కోచ్ షోయబ్, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర

గుంతకల్లు: అనేక కార్మిక ఉద్యమాల్లో అబ్దుల్ వహబ్ క్రియాశీలక ప్రాత పోషించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు అబ్దుల్ వహబ్ సంతాప సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు జిల్లా కార్యదర్శి జాఫర్, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్‌డీజీ బాషా, సీపీఎం నాయకుడు దాసరి శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు గుజారీ ఖాజా, అంజుమన్ కమిటీ నాయకులు వలీబాషా తదితరులు హాజరై వహబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్.గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

పెద్దవడుగూరు: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ గోపీకృష్ణ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది రికార్డులను తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. సిబ్బంది ఎక్కడికి వెళ్తున్నారనే సమాచారం మూవెంట్ రిజిస్టర్‌లో ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గుత్తి కోటకు విద్యార్థుల ట్రెక్కింగ్



కోటపైకి ట్రెక్కింగ్ చేస్తున్న గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

గుత్తి: గుత్తి కోటపైకి గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు గురువారం ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కోటపై ఉన్న ఏనుగుల శాల, గుర్రపు శాల, బావులు, చీకటి గదులు, రంగ మంటపం, సొరంగాలు, ఖిల్లా వంటివి వీక్షించారు. కోట గైడ్ రమేష్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, ఆర్కాలజీ అధికారులు, సిబ్బంది కోట చరిత్రను, గొప్పతనాన్ని వివరించారు. సుమారు నాలుగు గంటల పాటు విద్యార్థులు కోటలో గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గుత్తి కోట చాలా అద్భుతంగా ఉందన్నారు. మరోసారి కోటను సందర్శిస్తామన్నారు.

ప్రభుత్వ భూమిలో పట్టాలు రద్దు చేయండి



తహసీల్దార్ భారతికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వెనుక సర్వే నంబర్-6లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరికి అక్రమంగా మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకాలను రద్దు చేయాలని గ్రామస్తులు మదనకామరాజు, కేశవులు, లక్ష్మినారాయణ, సీతారాముడు, కేపీ నాగరాజు, మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం రజాపురం గ్రామస్తులు తహసీల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామ శివారులోని సర్వే నంబర్-6లో ఉన్న సుమారు 72 ఎకరాలను బ్రిటీష్ హయాంలో పశువుల మేత, పచ్చిక బయలు కోసం వదిలేశారన్నారు. అందులో 7.5 ఎకరాలను గురుకుల పాఠశాలకు, నిరుపేదలకు ఇంటి పట్టాలకు కొంత భూమి కేటాయించగా 64.8 ఎకరాలు మిగిలిందన్నారు. అయితే రెవెన్యూ అధికారులు లంచాలు తీసుకొని ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులకు 12 ఎకరాలకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేశారన్నారు. గ్రామంలోని పశువుల మేతకు ఉపయోగపడే భూమిని ఇతరులకు కేటాయించడం ఏంటని వారు ప్రశ్నించారు. ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని రెవెన్యూ అధికారులు స్పందించి మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకాలను రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అక్రమ పాసుపుస్తకాల రద్దుకు కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తహసీల్దార్ భారతి తెలిపారు.

కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి



గుంతకల్లులో మాట్లాడుతున్న ఏఓ స్వాతి



యాడికిలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ స్వాతి సూచించారు. గుంతకల్లు పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కౌలు కార్డులు కావాల్సిన వారు సంబంధిత భూయజమాని నుంచి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, కౌలు రైతు ఆధార్ కార్డు, ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కౌలు కార్డులు కలిగిన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

పామిడి: కైలురైతులకు కౌలుకార్డుల వల్ల ప్రభుత్వపరమైన ప్రయోజనాలు చేకూరుతాయని ఏఓ డీ లీనా వసుంధర అన్నారు. గురువారం మండలంలోని వంకరాజుకాలువ, కండ్లపల్లి గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో కౌలురైతులకు కౌలుకార్డుల లబ్ధిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆయా గ్రామాల్లో హరిత అనంత కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఏఈఓ శ్రీనివాసరావ్, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, వీఏఏ శ్రీకాంత్, వీహెచ్ఏ వర్ష, సర్పంచ్‌లు తలారి లక్ష్మీదేవమ్మ, కోటంక సుజాత, రైతులు పాల్గొన్నారు.

యాడికి: యాడికి మండల కేంద్రంతో పాటు వీరారెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన కోసం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మహబూబ్ బాషా మాట్లాడుతూ కౌలు రైతులకు సాగు పత్రాలు ఉంటే బ్యాంకులో రుణాలు, ప్రకృతి వైపరీత్యాలు వల్ల పంట దెబ్బ తింటే ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యసేవలు

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో గురువారం నుంచి వైద్యసేవలు ప్రారంభించినట్లు డాక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ భ్రమరాంబదేవి ఆదేశాల మేరకు యర్రగుంట్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం నిర్మించే వరకూ గ్రామంలోని తాత్కాలిక భవనంలో ప్రజలకు వైద్యసేవలు అందజేస్తామన్నారు. యర్రగుంట్ల పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల ప్రజలు వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా ఉరుసు

తాడిపత్రి రూరల్: మండలంలోని చల్లవారిపల్లి సమీపంలో గురువారం ఇమాం హుస్సేన్‌వలి స్వామి ఉరుసు వైభవంగా నిర్వహించారు. భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

హరిత వనంగా మార్చేందుకు కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ సునీత, అధికారులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రాన్ని హరిత వనంగా మార్చేందుకు కృషి చేద్దామని ఎంపీపీ సునీత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో హరిత అనంత కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీపీ మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతి మెట్లు అని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు వహీద, లింగానాయక్, ఏఓ శ్రీవాణి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏపీఓ పోలేరయ్య, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణానికి దరఖాస్తుల స్వీకరణ

గార్లదిన్నె: ప్రభుత్వం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు సబ్సిడీపై పశువుల షెడ్ల నిర్మాణం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు మినీ గోకులాలు నిర్మిస్తుందన్నారు. రెండు పశువుల యూనిట్ విలువ రూ.1,01500 కాగా, రైతు వాటాగా 10 శాతం అంటే రూ.11,500 చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు పశువులకు రూ.1,85,000 కాగా సబ్సిడీ పోనూ రైతు వాటా రూ.18,500 చెల్లించాల్సి ఉంటుంది. ఆరు పశువులకు రూ.2,30,000 అయితే సబ్సిడీ పోనూ రైతు వాటా కింద రూ.23,000 చెల్లించాలన్నారు. అలాగే గొర్రెలు, మేకలు కోళ్ల షెడ్ నిర్మాణాలకు కూడా సబ్సిడీ ఉందన్నారు. అర్హులైన రైతులు యర్రగుంట్ల పరిధిలోని గ్రామాలు యర్రగుంట్ల పశువైద్యశాలలో, గార్లదిన్నె పశువైద్యశాల పరిధిలోని గ్రామాల రైతులు గార్లదిన్నెలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు పశువైద్యశాలలో వైద్యులను సంప్రదిం చాలన్నారు.

ఘనంగా సప్తాహ్ వారోత్సవం

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో గురువారం సప్తాహ్ వారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం కే రామ్‌కుమార్, ఎన్‌సీసీ యూనిట్ అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ జయానాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం ఆచరణలో భాగంగా సప్తాహ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఇనుప రేకులు తొలగించండి'

యాడికి: వర్షాలు సక్రమంగా కురవాలంటే మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంపై రెండేళ్ల క్రితం నిర్మించిన ఇనుప రేకులను తొలగించాలని గురువారం మండల ప్రజలు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడిని కోరారు. గత రెండేళ్ల నుంచి సక్రమంగా వర్షాలు కురవక పోవడంతో పంటలు పంటలు పండక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇనుపరేకులు ఏర్పాటు చేసిన దాతలు, భక్తులతో మాట్లాడి వాటిని తొలగిస్తానని బొంబాయి రమేష్ నాయుడు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీ నాగరాజు రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాడిపత్రి రూరల్ : మండలంలోని యర్రగుంటపల్లి వద్ద గురువారం టిప్పర్ ఢీకొన్న ఘటనలో చితంబరయ్య , అతడి బావమరిది తిరుపతయ్యకు తీవ్ర గాయాలయ్యాయని అప్‌గ్రేడ్ రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. నార్పల మండలం వెంకటాంపల్లికి చెందిన వారు పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో తాడిపత్రికి వస్తుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీ కొందన్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. వారి నుంచి ఫిర్యాదు తీసుకున్న అనంతరం అనంతపురానికి తరలించామని ఆయన తెలిపారు.

పైపులు పడి వృద్ధురాలికి గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని గంగాదేవిపల్లి సమీపంలోని తాడిపత్రి- గుత్తి హైవే రోడ్డు పక్కన పండ్ల వ్యాపారం చేస్తున్న లక్ష్మీదేవిపై పైపులు పడడంతో తీవ్రంగా గాయపడిందని గురువారం అప్‌గ్రేడ్ రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. గుత్తి నుంచి తాడిపత్రి వైపు పైపుల లోడ్‌తో లారీ వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. లారీలోని పైపులకు కట్టిన తాడు తెగిపోవడంతో పైపులు రోడ్డుపై చెల్లచెదురుగా పడ్డాయన్నారు. అందులోని కొన్ని పైపులు రోడ్డు పక్కన పండ్ల వ్యాపారం చేస్తున్న లక్ష్మీదేవిపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయన్నారు. గాయపడిన ఆమెను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించి లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

గడ్డివాముకు నిప్పు

గార్లదిన్నె: కల్లూరులో గురువారం అగ్ని ప్రమాదంలో గడ్డివాము కాలిపోయింది. స్థానికుల వివరాల మేరకు.. రైతు బ్రహ్మానందరెడ్డి కల్లూరు రైల్వే స్టేషన్ సమీపంలోని పొలంలో వరి గడ్డి వాము వేసుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డివామి కాలిపోయి రూ.70 వేలు నష్టం జరిగినట్లు బాధిత రైతు వాపోయాడు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామంలో బురద నీటిలో గంబూసియా చేపలను వదులుతున్న వైద్య సిబ్బంది



యాడికి మండలంలో గంబూసియా చేపలు వదులుతున్న దృశ్యం



పెద్దపప్పూరు మండలంల పెద్దయక్కలూరులో మురుగులో గంబూసియా చేపపిల్లలను వదులుతున్న డా.ఉషారాణి

పుట్లూరు: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వైద్యాధికారి శ్రీవాణి అన్నారు. మండలంలోని కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి గ్రామాల్లో గురువారం వైద్య సిబ్బందితో కలసి ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లోని మురుగునీటిలో గంబూసియా చేప పిల్లలను వదిలారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గంబూసియా చేపలు దోమల లార్వాలను తినడం వల్ల లార్వా నిర్మూలన కావడంతో పాటు దోమల వృద్ధిని నివారించవచ్చన్నారు.

పెద్దవప్పూరు: మండలంలోని పెద్దయక్కలూరు,జూటూరు గ్రామాల్లో డా.ఉషారాణి ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నిల్వ ఉన్న ఆహారాన్ని తినకూడదన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు ఉన్న చోట సున్నపు పొడి, బ్లీచింగ్ పౌడర్ లేదా వేస్టు ఆయిల్‌ను వేయాలన్నారు. అనంతరం పలు కాలనీల్లో ఉన్న మురికి నీటిలో ఆమె గంబూసియా చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శర్మాస్‌వలి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యాడికి: మండలంలోని తిప్పారెడ్డి పల్లి, పుప్పాల, కొట్టాల పల్లి గ్రామాల్లో గురువారం దోమల లార్వాలు వద్ధి చెందకుండా నీటి కుంటల్లో గంబుషియా చేపలు వదిలారు. కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, డాక్టర్లు శ్రీరామ్ కుమార్, అప్పయ్య, సూపర్ వైజర్లు రాంప్రసాద్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.